# తరాల అంతరం

## నెల్లుట్ల రమాదేవి

కళ్ళు విప్పి చూసేసరికి ఎదురుగా అలారం టైంపీస్ అరున్నర చూపించింది సావిత్రికి

బరువుగా రెప్పల నంటిపెట్టుకున్న నిద్రమత్తు ఎక్కడికో ఎగిరిపోయింది అయ్యో బాబోయ్! అత్తగారు ఏం చండకం చదువుతోందో!" అనుకుంటూ లేచి పక్కకు తిరిగి చూసింది గాఢనిద్రలో ఉన్న భర్తకు దుప్పటి సరిగా కప్పి బయటికి వచ్చింది చీర సరిచేసుకుంటూ

వంటింట్లోంచి అత్తగారి స్తోత్రపారాలు వినవస్తూనే వున్నాయి

ఏం నిద్రలో తల్లీ మాయదారి నిద్రలు! బారెడు పొద్దెక్కే దాకా మంచం దిగకపోతే మహాలక్ష్మి ఉండాల్సిన నట్టింట ఇనుప గజ్జెల తల్లి నాట్యం చేయదూ! మేమూ చేశామమ్మా సంసారాలు! ఏ యామురాత్రికి లేచి ఇల్లూ వాకిలీ ఊడ్చి, అలికి, **కళ్ళాపు జల్లి ముగ్గులు పెట్టాకే తెల్లవారేది** ఇప్పటి కాలమే వేరు తల్లీ – ఝాము పొద్దెక్కే దాకా మొగుడి పక్క వదలని సాని పాపల్లాగా.

ఇలా సాగిపోతూనే వుంది రాంబాయమ్మ వాక్ప్రవాహం ఇలాంటి మాటలు వినీవిని అలవాటయి పోయాయి సావిత్రికి. అసలు తను

**రోజూ అత్తగారు లేవక ముందే నాలుగ్గంటలకే** లేచి పని చేసుకుంటుంది. నిన్న రాత్రి ఆవిడే రామాలయంలో పురాణ కాలక్షేపానికని వెళ్ళి పదకొండు గంటలకు తిరిగి వచ్చింది ఆవిడ వచ్చేలోగా తను నిద్రపోతే ఇంకేమన్నా వుందా? తలుపు కొట్టగానే తీయకపోతే ఒకసారి ఎంత గొడవ చేసిందని? ఆ భయంతోనే నిద్ర వస్తున్నా బలవంతంగా ఆపుకుంటూ కూర్చుంది తీరా పడుకునే సరికి పన్నెండయింది ప్రొద్దున తొందరగా మెలకువ రాలేదు. అదేమంత ఘోర అపరాధమని



అంత నీచంగా మాట్లాడుతోంది? అయినా తనేమైనా యంత్రమా? అక్కడికి ఉదయం లేచినదగ్గర్నుంచీ రాత్రి పడుకునే వరకు క్షణం తీరిక లేకుండా పని చేస్తూనే వుంటుంది

ఎంత పాపం చేసుకున్నానో, ఈ కొంపలోకి వచ్చి పడ్డాను" బాధగా అనుకుంది సావిత్రి

రాంబాయమ్మది ఉత్త నోటి దురుసు స్వభావం **దానికి తోడు కొడుకు పుట్టగానే భర్త పోయి అతని** అన్నదమ్ములు ఆవిడ్ని మోసం చెయ్యడానికి ప్రయత్నిస్తే అష్టకష్టాలు పడి తన వంతు ఆస్తి దక్కించుకోవడంలో - అహంకారం, దాష్టీకం బాగా అలవడ్డాయి సావిత్రి పెద్ద కుటుంబంలో పుట్టింది రాంబాయమ్మకు సూర్యం ఒక్కడే కొడుకనీ బుద్ధిగా వ్యవసాయం చేసుకుంటున్నాడని విని సావిత్రికి అంతకంటే మంచి సంబంధం తెలేక సూర్యానికిచ్చి పెళ్ళి చేసారు ఛామనఛాయగా వున్నా సావిత్రిది మంచి కళగల ముఖం పైగా పనిపాటా బాగా వచ్చు వినయ విధేయతలకేమీ తక్కువలేదు చెప్పినట్టల్లా వినే కోడలు రావడంతో ఆనందించడానికి బదులు ఆమెను రాచి రంపాన పెట్టడం అలవాటయింది రాంబాయమ్మకు

చేతిలో చెంబు పట్టుకుని ఎంతసేపు నిలబడ్తావే గోడలాగా? త్వరగా ముఖం కడుక్కో. నా ఖర్మ! ఇంత జాడ్యం మనిషి అయిన కోడలు రావాలని రాసుందేమో నా నొసట! గొణుక్కుంటూ వెళ్ళింది రాంబాయమ్మ

'నీ ఖర్మ కాదు ఇదంతా నా ఖర్మ' మనసులో అనుకుంది సావిత్రి

ఆ రోజు ఉదయం నుంచి ఒంట్లో జ్వరంగా వుందని పడుకుంది రాంబాయమ్మ అప్పుడప్పుడూ ఇలా దొంగ సుస్తీలు ఆవిడకు మామూలే అయినా మంచంలో పడుకొని వుండే తన గొడవకు ఇల్లూ వాకిలి ఏకం చేసింది

పడుకుంటే కాస్త మందు తెచ్చిచ్చే దిక్కు కూడా లేది కొంపలో అదే పెళ్ళానికయితే ఈ పాటికి నలుగురు డాక్టర్లు ఇంటికి వచ్చేవారు కదా అన్నారా పెళ్ళాం బెల్లం తల్లి అల్లం అని ఈ **ముసలి ముండ ఛస్తేనేం?"**

సూర్యం డాక్టర్నడిగి మందు తెచ్చేలోగా సావిత్రికి వినిపించేటట్టు గొణుగుతూనే వుంది మధ్యాహ్నం వరకల్లా జ్వరం పూర్తిగా తగ్గింది అయినా నీరసం నటిస్తూ పడుకునే వుంది.

సాయంత్రం సావిత్రిని సినిమాకు వెళదాం తయారుగా వుండమన్నాడు సూర్యం

అమ్మో! ఇంకేమన్నా ఉందా! అత్తయ్యకు జ్వరం ఇప్పుడు సినిమా కెళ్తే ఏం బావుంటుంది' అంది సావిత్రి

"జ్వరమేమీ లేదని చెప్పాడుగా!, అయినా చేతనవుతుందంటే తనను కూడా తీసుకెళదాం ఆ సినిమా ఇవాళే ఆఖరు అసలు నేనొక్కడ్నే వెళ్ళి చూసి రాగలను కానీ, నువ్వు కూడా చూస్తావని రమ్మంటున్నాను' అన్నాడు సూర్యం


సావిత్రికి వెళ్ళాలనే వుంది ఎప్పుడూ పని– పనే విసుగ్గా ఉంది కూడా. అలా ఎటైనా వెళ్తే మనసు బావుంటుందనుకొని తయారు అయింది

రాంబాయమ్మను అడిగితే రానంది మనసులో వెళ్ళాలని వున్నా పొద్దుట్నుంచీ పడుకుని ఇప్పుడు సినిమా కనగానే వెళితే ఏం బావుంటుంది' అనుకుంది తీరా కొడుకూ, కోడలూ వెళ్తున్నామని చెప్పేసరికి ముఖం గంటు పెట్టుకుని ఏమీ మాట్లాడలేదు

సినిమా చూసిన ఆనందంలో ఇంటికి వచ్చిన సూర్యం, సావిత్రిలకు మంచంలో దుప్పటి కప్పుకుని వణుకుతూ పడుకున్న రాంబాయమ్మ కనిపించింది.

"ఏమయిందమ్మా! మళ్ళీ జ్వరం వచ్చిందా?" సూర్యం అడిగాడు.

"నేనేమైతే నీకేంతి నాయనా! వెధవ ప్రాణం పోయినా బావుండేది. నా గురించి బాధపడే వాడివయితే వెళ్ళేవాడివా? అయినా అడ్డాల నాడు బిడ్డలు గానీ అని ఊరికే అన్నారా? ఇదంతా నా



తలరాత ఆ మారాజుతో బాటు ఆనాడే పోయి వుంటే ఈ తిప్పలు వుండేవా? "ముక్కు చీదుతూ సావిత్రి కేసి తిరిగింది.

"అయినా ఇవేం టక్కులాడి వేషాలే? వాడు రమ్మనగానే వెళ్ళడానికి నీకు సిగ్గెలా లేకపోయింది? మా కాలంలో పగటిపూట మొగుడి ముఖం చూస్తేనే ఎంతో తప్పుగా ఎంచేవారు ఇప్పటాళ్ళకి సిగ్గూ, ఎగ్గూ లేకుండా పోతున్నాయిలే! మొగుడ్ని కావిలించుకుని పికపికలూ, పకపకలూ – హూ ! మా కాలంలో అత్త అంటే ఎంత భక్తి! వణికి చచ్చిపోయే వాళ్ళం. ఇప్పుడో అత్త మాటంటేనే విలువ లేదు. పాడు కాలం" గబగబా అంటూనే వుంది.

**సినిమా చూసి వచ్చిన ఆనందమంతా ఎగిరి** పోయింది సావిత్రికి "చీ! ఏం బ్రతుకు తనది? ఒక సినిమాకు వెళ్ళే స్వతంత్రం కూడా లేకపోయాక ఎందుకీ బ్రతుకు?" అనుకుంది.

ఆ తరువాత వారం రోజులకు దీపావళి పండుగ వచ్చింది. పంట తాలూకూ డబ్బు రాగానే సూర్యమే బజారుకెళ్ళి తల్లికీ సావిత్రికీ కొత్త చీరలు తెచ్చాడు. తన తెల్ల "జరీ చీరను చూసుకుని మురిసిపోయిన రాంబాయమ్మ సావిత్రికి తెచ్చిన చీర చూడగానే ముఖం చిట్లించింది. నెమలి పింఛం రంగు చీర నిండా జరీ బుటాతో, కింద పెద్ద బార్డర్‌తో ఎంతో అందంగా వున్న ఆ చీరను చూసుకుని మురిసి పోతున్న సావిత్రిని చూసి మూతి మూడు వంకర్లు తిప్పింది.

"ఎందుకురా సూర్యం ఇప్పుడు అంత ధర పెట్టి ఇలాంటి చీర కొన్నావు? ఏదో ఇలాంటిదే దానికీ తేలేక పోయావా? అయినా సావిత్రి మాత్రం బయటికి వెళ్ళేదా ఏమైనానా? ఇంట్లో వుండే వాళ్ళకు అంతంత చీరలు మాత్రం ఎందుకు? దానికేం? మహారాణిలా ఇంట్లో కూర్చుని నువ్వు తెచ్చినవన్నీ కట్టు-కుంటుంది. ఎక్కడి నుంచీ వస్తుందీ అన్న ఆలోచనుంది గనకనా?" అంది కొడుకుతో.

సావిత్రికి మనసు చివుక్కుమంది. ఒక్క చీర కోసం అంత రాద్ధాంతం చేస్తుందేమిటి ఈవిడ? అసలు కోడలు అంటే ఒక మనిషే కాదు ఈవిడ దృష్టిలో. ఎప్పుడూ బాధ పెట్టడానికి కోడలు ఓ సాధనం అనుకుంటుందేమో? తనను ప్రేమగా చూసుకుంటే తను మటుకు ఇప్పటిలా భయంతో కాక భక్తితో గౌరవంతో ఎంత బాగా చూసుకునేది ఆవిడని? ముందు ముందు తనకు కోడలు వస్తే మాత్రం ఇలా బాధ పెట్టకూడదు. ఎంతో ప్రేమగా చూసుకోవాలి అనుకుంది సావిత్రి.

★ ★ ★ ★

కాఫీ డికాషన్‌లో పాలూ, పంచదారా కలిపి రెండు కప్పుల్లోకీ పోసింది సావిత్రి. కొడుకూ, కోడలూ అప్పుడే లేచినట్టున్నారు వాళ్ళకు కాఫీ ఇవ్వాలని ఆవిడ తొందర. మళ్ళీ త్వరగా వంట చేయాలి. టైం చూస్తే ఎనిమిదయింది తొమ్మిది కల్లా కొడుకూ, కోడలూ ఆఫీసుకు వెళతారు. వెళ్ళేవరకు వంట చేయాలి.

కాఫీ తీసుకుని గది వరకూ వెళ్ళింది సావిత్రి. లోపల కొడకూ, కోడలూ నవ్వుతున్నారు.

"యూ నాటీ" అంటోంది సుధ కిలకిలా నవ్వుతూ.

"సుధా! కాఫీ తెచ్చాను. తీసుకెళ్ళమ్మా" అని బయట్నుంచి కేకేసింది సావిత్రి.

ముఖం అప్రసన్నంగా పెట్టుకుని బయటికి వచ్చి కాఫీ కప్పు లందుకుని మళ్ళీ లోపలికెళ్ళింది సుధ. తను వాళ్ళను డిస్టర్బ్ చేసినందుక్కాబోలు అని నవ్వుకుంది సావిత్రి.

భర్త పోయిన ఏడాదికే కొడుక్కు ఉద్యోగం వచ్చింది. అత్త అంతకు చాలా ఏళ్ళ క్రితమే పోవడంతో ఇక ఊర్లో ఉన్న ఆస్తిపాస్తులు అమ్ముకుని వచ్చి ఇక్కడే ఇల్లు కొనుక్కుని స్థిర-పడ్డారు. కూతురు పెళ్ళి సూర్యం ఉండగానే చేశారు. కొడుకు రవిని పూర్తి స్వేచ్ఛగా పెంచింది సావిత్రి. అందుకే సుధది కులాంతరమైనా కొడుకు ఇష్ట-

# శ్రీమతి పుణ్యశీలా ప్రసాద్ ఇంగ్లాండ్ పర్యటన



ప్రముఖ రచయిత్రి శ్రీమతి మాధవపెద్ది పుణ్యశీలా ప్రసాద్ ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ వారి పనుపున ఆరు వారాల పర్యటన నిమిత్తం ఏప్రిల్ చివరి వారంలో ఇంగ్లాండ్ వెళ్తున్నారు. భారతీయ సంస్కృతి, సాహిత్యాలపై ఆమె అక్కడ అనేకచోట్ల ప్రసంగిస్తారు. ఈమె రచించిన అనేక సీరియల్ నవలలు, కథలు, నాటికలు వివిధ పత్రికలలో ప్రచురింపబడి పాఠకుల ఆదరణని పొందాయి.

శ్రీమతి పుణ్యశీలా ప్రసాద్‌తో పాటు ఆమె భర్త, ప్రముఖ విద్యావేత్త, బరోడాలోని భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూలు ప్రిన్సిపాల్ శ్రీ ఎం. వి. ప్రసాద్ కూడా ఇంగ్లాండ్‌లోని నార్తాంప్టన్ షైర్ ఎడ్యుకేషనల్ అథారిటీ వారి ప్రత్యేక ఆహ్వానంపై ఆరు వారాల పాటు ఇంగ్లాండ్‌లో పర్యటిస్తారు.

ఇంగ్లాండ్ పర్యటన అనంతరం ఈ దంపతులిద్దరూ ఫ్రాన్స్, బెల్జియం, హాలెండ్, పశ్చిమ జర్మనీ, స్విట్జర్లాండ్ మొదలైన దేశాలని సందర్శించి జూన్ చివరి వారంలో స్వదేశానికి తిరిగి వస్తారు. □

పడ్డాడని సంతోషంగా పెళ్ళికి ఒప్పుకుంది. కొడుకూ, కోడలూ ఇద్దరూ ఉద్యోగాలు చేసేవాళ్ళు కావటాన ఇంటి పనంతా దాదాపు సావిత్రే చేస్తుంది. కొడుకూ, కోడలూ అన్యోన్యంగా ఉంటే చూసి సంతోషించడమే తప్ప ఏనాడూ కోడల్ని పల్లెత్తు మాట అనదు. ఇరుగుపొరుగు వాళ్ళంతా అదృష్టమంటే సావిత్రమ్మగారి కోడలిదే అనుకుంటుంటారు

కానీ సావిత్రికి "ఏ మూలో కాస్త బాధ తను ఎంత చనువిచ్చి ప్రేమగా చూసినా సుధ అందుకు తగ్గట్టుగా ప్రవర్తించదని. తన అత్తగారు చాలా మంచిదని ఆవిడ లాంటి అత్తలు ఎంతో అరుదని గుర్తించనట్టే ఉంటుంది.

"అన్నం రెడీ అయిందా అత్తయ్యా!" అంటూ వచ్చింది సుధ. తనూ తయారయి వెనకే వచ్చాడు రవి.

"పూర్తయింది. ఒక్క నిమిషంలో వడ్డిస్తాను. కూర్చోండి" అంది అన్నీ తెచ్చి టేబిల్‌పై సర్దుతూ.

"ఎందుకు లెండత్తయ్యా! మేమిద్దరమూ వడ్డించుకుని తింటాంలెండి" అంది సుధ.

"ఫర్వాలేదమ్మా! నాకు మాత్రం వేరే పనేముంది కనుక" అంటూ తనే వడ్డించింది సావిత్రి ఇద్దరికీ.

## తరాల అంతరం

ఆ సాయంత్రం రవి తల్లితో "అమ్మా! ఎల్లుండి మా మేరేజ్‌డే హోటల్లో అరేంజ్ చేయాలనుకుంటున్నాం" అని చెప్పాడు.

"లంకంత ఇల్లు పెట్టుకుని హోటల్లో ఎందుకురా నాయనా? ఇంట్లోనే చేసుకోండి కావల్సిన ఏర్పాట్లన్నీ మనమే చూసుకోవచ్చు" అని కొడుకును ఒప్పించింది సావిత్రి.

మేరేజ్‌డే రోజు పొద్దున్నే కొడుకూ, కోడల్ని పిలిచి తను కొన్న బట్టలు ఇచ్చింది సావిత్రి "నిన్ననే బజారుకు వెళ్ళి కొనుక్కు వచ్చాను. ఈ చీర ఇవాళ కట్టుకో సుధా" అంది.

"ఇప్పుడేందుకత్తయ్యా! అయినా ఇవాళ్టి ఫంక్షన్‌కని నేను వేరే చీర కొనుక్కున్నాను. ఫంక్షన్‌కు ఈ చీర ఏం బావుంటుంది? ఇంకెప్పుడైనా కట్టుకుంటా లెండి!" అంటూ ఆ చీరను బీరువాలో పడేసింది సుధ.

సావిత్రి మనస్సు చివుక్కుమంది.

* * *

ఆ రోజు ఆదివారం కావడంతో సుధా, రవీ ఇంట్లోనే ఉన్నారు, మధ్యాహ్నం భోజనం చేశాక కాసేపు నడుం వాల్చింది సావిత్రి కొడుకు గదిలోంచి మాటలు విన్పిస్తున్నాయి.

"మీరెన్నయినా చెప్పండి 'మీ అమ్మగారి వరస నాకేమీ నచ్చడం లేదు ప్రతి దానికీ ఆవిడకు నచ్చినట్టే చేయాలంటుంది. ఆవిడ కాలానికీ ఇప్పటి కాలానికీ బోల్డు తేడా ఉందని గ్రహించక పోతే ఎలా? ఇద్దరం కల్సి సర్దాగా కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేద్దామంటే తన చేతులతో వడ్డిస్తేనే తృప్తి అంటుంది. నా బట్టలు కూడా ఆవిడ సెలక్షనే అయితే ఇక ఎలా చచ్చేది? మొన్నటి చీర ఎంత దరిద్రంగా ఉందో చూసారా? మొన్నటికి మొన్న మన ఫ్రెండ్సందర్నీ పిలిచి హోటల్లో పార్టీ ఇద్దామనుకుంటే ఇంట్లోనే జరగాలని పట్టుబట్టింది. ఇంకో మూడేళ్ళ దాకా పిల్లలు వద్దనుకున్నామా? ఇక ప్రతివాళ్ళ ముందూ సుధ నా కెపుడు మనవడ్నిస్తుందో అంటూ వుంటుంది. అక్కడికి నాకు వేరే పనేమీ లేనట్టు ఐ కాంట్ బేర్ దిస్ ఎటాల్ ఈ రోజుల్లో పెళ్ళి కాగానే ఎవరికి వారు వేరే కాపురాలు పెడుతున్నారు మనం తప్ప. మీరేమో చెబితే వినరు. మనం కూడా వేరే ఇల్లు తీసుకుని ఉందాం. ఏమంటారు?" అది సుధ గొంతు.

"ఉష్! ఊరుకో సుధా! అమ్మ వింటే బాధపడుతుంది. ఈ వయసులో అమ్మ ఒకర్తే విడిగా ఎలా వుంటుంది? అయినా మనిద్దరం ఉద్యోగాలు చేస్తూ హాయిగా వుంటున్నామంటే ఇంట్లో పనంతా అమ్మ చేస్తుండబట్టే కదా! లేకపోతే ఎంత కష్టవుమతుందో ఆలోచించు రేపు మనకి పిల్లలు పుడితే అమ్మ లేకపోతే నీకే ఎంత కష్టమవుతుందో తెల్సా?" అంటున్నాడు రవి.

వింటున్న సావిత్రి గుండె వెయ్యి ముక్కలయింది. తను అత్తగారి చేతుల్లో అష్టకష్టాలు పడి తిరిగి ఆ బాధలు తన కోడల్ని పెట్టకూడదని ఎంత అపురూపంగా చూసుకుంటోంది? తన మంచితనం తన కోడలుకు తెలియడమే లేదు. తను ఇప్పుడు సుధనెలా చూసుకుంటోందో, అప్పుడు తన అత్త తనను అలా చూసుకుంటే ఎంత బావుండేదో అనుకునేది. తను ఆదర్శవంతురాలైన. అత్త అనుకుంది. కానీ సుధ అలా అనుకోవడం లేదు సుధ దృష్టిలో తను పాతకాలం అత్తే. పైగా పాత అలవాట్లు, పిచ్చి సెంటిమెంట్లతో కోడల్ని బాధించే అత్త తను సుధ దృష్టిలో మంచి అత్త అనిపించుకోవాలంటే తను ఇంకొక తరం ముందు ఆలోచించగలగాలి. అది తను ఈ జన్మకు చేయలేదు. అంటే సుధకు తను ఎప్పుడూ నచ్చదు. హు! ఒక తరానికీ మరో తరానికి ఎంతటి వ్యత్యాసం? అటు కోడలుగానూ, ఇటు అత్తగానూ బాధపడ్డ సంధియుగంస్త్రీ తాను! సావిత్రి నిర్లిప్తంగా నిట్టూర్చింది. □